క్లుప్తంగా

కత్తెర సురేష్ కుమార్‌కు రాఖీ కట్టిన మహిళలు



తాడికొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌కు ప్రజా ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు అండగా పలు చట్టాలను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారని, తనవంతు కూడా సాయమందిస్తూ మహిళలకు అండగా నిలుస్తానని తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధులపై చిత్రప్రదర్శన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రప్రదర్శనను హెచ్ఎం సిస్టర్ వి.థెరేసమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం, దేశానికి స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన సమరయోధులను గుర్తుకు చేసుకోవడం మంచిదని చెప్పారు. ప్రతి విద్యార్థిని, వారు దేశానికి చేసిన సేవలను గుర్తుంచుకోవాలని చెప్పారు. ఆ మహనీయుల చిత్రాలను సేకరించి ప్రదర్శించిన ఉపాధ్యాయుడు దీవి, కమల్‌మోహన్‌ను అభినందించారు.

ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. భాగ్యరాజ్ పిలుపునిచ్చారు. మంగళగిరి రూరల్ పరిధిలోని బేతపూడిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై నిత్యావసరాల ధరల భారాలు మోపుతోందని, ఇవి కాకుండా విద్యుత్ ఛార్జీలు, చెత్త పన్ను, నీటి పన్ను, ఆస్తి పన్నులు విపరీతంగా పెంచేసిందని, ప్రజల కుటుంబాలు గడవడం కూడా కష్టంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో కె.నానయ్య, యేసోబు పాల్గొన్నారు.

వైభవంగా విఖనసా జయంతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణపౌర్ణమి, విఖనసాచార్య జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ముఖమండపం వద్ద విఖనసాచార్యుల చిత్రపటాన్ని ఏర్పాటుచేసి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, దివి వర ప్రసన్నమూర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దిశ పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: దిశ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, త్వరితగతిన దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. నగరంపాలెంలోని దిశ పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో నమోదు చేయడంతోపాటు రశీదులు ఇవ్వాలని అన్నారు. ఎస్పీ వెంట దిశ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, దిశ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం ఉన్నారు.

డాక్టర్ సీఎస్ రావుకి మదర్ థెరీసా అవార్డు



డాక్టర్ సి.ఎస్.రావును సన్మానిస్తున్న మల్లాది విష్ణు, పుణ్యశీల

గుంటూరు మెడికల్: మదర్ థెరీసా సర్వీస్ అవార్డును గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.రావుకు లభించింది. గురువారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ శాసనసభ్యుడు మల్లాది విష్ణు, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ పుణ్యశీల చేతులు మీదుగా అందుకున్నారు. ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న రాష్ట్రంలోని పలువురికి వారి సేవలను గుర్తించి వారికి అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ సి.ఎస్.రావుకు గుంటూరు లలిత హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముంజంపల్లి శివకుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రతి ఓటూ క్షుణ్ణంగా పరిశీలించాలి

- తుదిజాబితాలో తప్పులు ఉండకూడదు
- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ హేమమాలిని



ఓటరు వివరాలు సేకరిస్తున్న కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ హేమమాలిని

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్క ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలి, తుది జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.హేమమాలిని ఆదేశించారు. మంగళగిరి పరిధిలోని 144, 151, 171, 179, 166, 168, 187, 190 పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు, భవనాల నాణ్యత, ఇతర సౌకర్యాలను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయా బూత్‌లలో బీఎల్‌ఓలతో కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తొలగించిన ఓట్లతో పాటు కొత్తగా చేర్పించే ఓట్లు, డబుల్ ఎంట్రీలు, పట్టణాన్ని వదిలి వెళ్లినవారు, అడ్రస్ మారిన వారి ఓట్లను బీఎల్‌ఓలతో పాటు ఇతర అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, ప్రతి బూత్‌లో కొత్త ఓట్లు చేర్పించడంతో పాటు మృతి చెందిన వారి వివరాలు ఒకటికి రెండు సార్లు పరిశీలించి వారి కుటుంబ సభ్యుల మరియు వివిధ పార్టీ నాయకుల అనుమతితో తొలగిస్తున్నామని చెప్పారు. అలాగే ఒక బూత్ నుంచి మరో బూత్‌లోకి ఇళ్లు మారిన వారి అడ్రస్‌లు మారుస్తున్నామని వివరించారు. ఏమైనా ఓటరు లిస్టు విషయంలో పొరపాట్లు జరిగితే తనని సంప్రదించాలని ఆమె కోరారు. పరిశీలనా కార్యక్రమంలో ఏసీపీ సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు అందజేస్తున్న ఆలపాటి రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ రతన్ బాబు తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని సీకే జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్నతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రతన్ బాబు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమిని పురస్కరించుని కళాశాల ఆవరణలో పచ్చదనం కోసం 25 మొక్కలు నాటామని, చెట్లను పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్ నాగమణి, ఉన్నతి సేవా సంస్థ అధ్యక్షులు ఆలపాటి రాధిక, కళాశాల సెక్రటరీ జంజనం పాండురంగారావు, వడ్లమూడి వెంకయ్య చౌదరి, సంస్థ ప్రతినిధులు జి.మురహరి రావు, రామనాథం యుగంధర్, వెంకట నారాయణ, నరసింహారావు, పూర్ణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి(ఆర్కే) తోపుడు బండ్లను తయారు చేయించి సస్థానిక నాయకుల ద్వారా గురువారం అందజేయించారు. మంగళగిరి రూరల్ పరిధిలోని కురగల్లులో నివాసముంటున్న కట్టెపోగు వెంకటేశ్వరరావు, కట్టెపోగు చెంచు రామారావు, పల్లెపోగు నాగేశ్వరరావులు అద్దె బండ్లపై పండ్ల వ్యాపారంచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి తోపుడు బండ్లు అందజేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన అనిల్ కుమార్, చీకటి నిర్మల, ఉసిరికాయల ఆదిలక్ష్మి, షేక్ అలీమా అనే వారు తోపుడు బండ్లపై కూరగాయలు, మొక్కజొన్న కండెలు, పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి బండ్లు అందించారు.

మృతుల కుటుంబాలకు సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో మృతి చెందిన పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందించిన ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు గురువారం అందజేశారు. పెదకొండూరు గ్రామానికి చెందిన కుక్కమళ్ల మాణిక్యం, గొడవర్రు గ్రామానికి చెందిన గద్దం వెంకటేశ్వరరావు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండూరు సుమన్, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, గద్దం శంకర్, కొండూరు ప్రసాద్, మరియదాసు, కొండూరు శేషయ్య పాల్గొన్నారు. రేవేంద్రపాడుకు చెందిన కూరపాటి నాగరత్నం మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో రేవేంద్రపాడు సర్పంచి పలుకూరి మేరమ్మ, కొప్పుల ప్రకాశ్‌రావు, కనపర్తి సాంబశివరావు, పలుకూరి శామ్యూల్, జాకోబ్ పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరుకు బుల్ల మరియమ్మ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఎస్సీ సెల్ నాయకులు ఆదామ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు సామాజిక స్పృహ అవసరం

మాల్‌టెక్ సొల్యూషన్స్ సీఈఓ మధుకిరణ్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మోతడక(తాడికొండ): పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహను కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాల్‌టెక్ సొల్యూషన్స్ సీఈఓ కె.మధుకిరణ్ సూచించారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డిప్లొమా ఓరియంటేషన్‌పై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంజినీరింగ్ విద్య ద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు సృష్టించి సామాజిక సమస్యలను పరిష్కరించడమే కాకుండా స్టార్ట్ అప్‌లను స్థాపించి వాటి ద్వారా ఉపాధి కల్పన చేసి దేశాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంచి నడవడికతో విద్యను అభ్యసించడం ద్వారా దేశం గర్వించే స్థాయికి వెళ్ళాలని, అప్పుడు మీ నైపుణ్యాలను చూసి దేశ, విదేశీ సంస్థలు మీకోసం బారులు తీరతాయన్నారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించి నాగ్ ఎ గ్రేడ్, ఎన్‌బీఏ, అటానమస్ వంటి గుర్తింపుతో పోటీ ప్రపంచంలో సాంకేతిక కోర్సులను అందించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అతిథులను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వై.సుజిత్, ప్రిన్సిపాల్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు, డిప్లొమా కోర్సు ప్రిన్సిపాల్ జె.జయకృష్ణ, పలు విభాగాధిపతులు వీవీ సుబ్బారావు, బి.తులసీ రాణి పాల్గొన్నారు.

సేఫ్టీ కాని ప్రైమ్ 2.0 విధానం సరికాదు



సబ్ రిజిస్ట్రార్ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు

తాడికొండ: ప్రజలకు సేఫ్టీ కాని ప్రైమ్ 2.0 విధానం సరికాదని తాడికొండ మండల దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు అన్నారు. ఈ మేరకు తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం రిజిస్ట్రార్ నాగ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కంప్యూటర్ అవగాహన లేని గ్రామాల్లో నివసించే జనాభా రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ ఏ విధంగా చేస్తారన్నారు. ఈ విధానంలో లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టి కొనుగోలు చేసే ఆస్తులను, పంచుకునే ఆస్తులను, పిల్లలకు రాసే ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తులు లేకుండా కేవలం జిరాక్స్ కాపీతో సమానమైన ప్రింట్లు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ విధానంలో చాలా ఇబ్బందులు ఉన్నందున ఈ తరహా రిజిస్ట్రేషన్లు రద్దుచేసి రైతులకు ఇష్టమైన విధానంలో ఆన్‌లైన్‌లోనే చేసుకునే విధంగా సర్వీసులు ఇవ్వాలన్నారు. ఇందుకు నిరసనగా గురువారం పెన్‌డౌన్ చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు రక్తదాన ఆవశ్యకత గుర్తించాలి



డాక్టర్ సుష్మాను సత్కరిస్తున్న అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగాలతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. బ్లోసమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుష్మా మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ధాత్రికుమారి, సంతోషికుమారి, సుబ్బరత్నమ్మ, విజయకుమారి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణపై అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడిలోని పత్తి పంట పొలాల్లో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపిక చేసిన 30 మంది రైతులకు సాగుపై ఏఓ రమణకుమార్ అవగాహన కల్పించారు. మొక్కలను పరిశీలించి వాటిలో చీడపీడలను గుర్తించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విశ్లేషించిన దాన్ని ఛార్టుపై బొమ్మల రూపంలో వేసి పచ్చదోమ, పేనుదోమ అధికంగా ఉన్నట్లుగా వారితో గుర్తించినట్లు చెప్పారు. వాటి నివారణకు ఇమిడా క్లోపిడ్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదా పది కిలోల వేపపిండిని ఐదు లీటర్ల ఆవు మూత్రంలో 12 గంటలు నానబెట్టి ఒక ఎకరా పొలంలో పిచికారీ చేయాలిన్నారు. కార్యక్రమంలో అన్నామణి, రాంబాబు, షేక్ సుభాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తాడికొండ: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన ఘటన తుళ్లూరు మండలం తానావతి చెరువు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పెదపరిమి గ్రామానికి చెందిన కొల్లి సాంబిరెడ్డి(65) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కాంక్రీట్ మిక్సింగ్ కంపెనీకి చెందిన లారీ ఢీకొట్టడంతో పాటు పొట్ట భాగంపై నుంచి వెళ్లడంతో పేగులు బయటకు వచ్చి ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలాడు. డ్రైవర్ వాహనం వదిలి పారిపోయినట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచానామా నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి ఏఎన్‌యూ డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: కేవీపీ కాలనీ కేఎస్ఆర్టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఎన్‌సీహెచ్ సుధా మైథిలికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు గురువారం తెలిపారు. శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి సాహిత్యానుశీలనం అనేఅంశంపై గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఇటీవల ఏఎన్‌యూలో జరిగిన స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ సుధా మైథిలిని హెచ్ఎం రాంబాబుతో పాటు పాఠశాలలోని సహచర ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాలికపై లైంగిక దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనపై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన బాలిక 9వ తరగతి వరకు చదివి గొల్లపూడి హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో పనికి వెళ్తోంది. అదే కాంప్లెక్స్‌లో పని చేస్తున్న గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడుకు చెందిన తిరుపతి ముఠా కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఈ విషయం బాలిక ఇంట్లో తెలియడంతో ఆమెను మచిలీపట్నంలోని ఆమె సోదరి ఇంటికి పంపించి వేశారు. రక్షాబంధన్ సందర్భంగా బాలిక విద్యాధరపురంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. విషయం తెలుసుకున్న తిరుపతి, బాలికకు మాయమాటలు చెప్పి మహానాడులోని తన స్నేహితుడి రూమ్‌కు తీసుకెళ్లి, అక్కడ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడు తిరుపతిపై భవానీపురం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉచిత మెగా మెడికల్ శిబిరం

పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సెప్టెంబరు 2న ఉచిత మెడికల్ మెగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్ చెప్పారు. ఆర్.అగ్రహారంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి మహానేత వైఎస్సార్ కొనియాడారు. ఈనెల 2న పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే వర్ధంతి కార్యక్రమం, అనంతరం ఉచిత వైద్య శిబిరం వైద్యులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతోందన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ తనిఖీ



తాడికొండలోని పౌరసరఫరాల గోదామును పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

తాడికొండ: తాడికొండలోని పౌరసరఫరాల గోదాములో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లోని స్టాకును పరిశీలించి గోదాము వివరాలు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పౌరసరఫరాల దుకాణాలకు సరుకు చేరుతుందా లేదా అనే దానిపై ఆరా తీశారు. అనంతరం తాడికొండ సచివాలయం-3ను తనిఖీ చేసిన ఆమె ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిషన్ జీఈఆర్ 100 పనులు పురోగతిని పరిశీలించారు. కౌలు రైతులకు కార్డులు త్వరితగతిన అందజేయాలని సూచించి, పీఎం కిసాన్‌లో అర్హులుగా ఉండి రెవెన్యూ రికార్డులలో లేని రైతుల జాబితాను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. 2003 ఏడాదికి ముందు అసైన్డ్ భూమల జాబితాను గుర్తించి జిల్లా స్థాయిలో ఇచ్చిన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఏ విధంగా అమలు చేస్తున్నారో పరిశీలించి ఎలా చేయాలో వీఆర్వోలకు వివరించారు. అన్ని పనులు సకాలంలో పూర్తి చేయాలని సచివాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి అర్జీలను త్వరితగతిన పరిష్కారం తెలిపాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ గ్రామంలో పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేశారు.

గులాబీరంగు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలి

నిడుముక్కలలో పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్త డాక్టర్ శారద



పత్తి పంటను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఒ.శారద తెలిపారు. గురువారం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పత్తి పంటల పర్యవేక్షణ, గులాబి రంగు పురుగుల నివారణపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని పత్తి పంటలను పరిశీలించారు. పంట పూత దశలో ఉందని, గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించి, నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజుకు 8 రెక్కల పురుగులను వరుసగా మూడు రోజులు బుట్టల్లో గుర్తించినట్లయితే గుడ్లపై పనిచేసే వేపగింజల కషాయం 5 శాతం, అజాడిరాక్సిన్ 3000 పీపీఎం, 600 మిల్లీ లీటర్లు గానీ, ప్రొఫెనోఫాస్ 40 మిల్లీ లీటర్లు గానీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గుడ్డి పువ్వులను గుర్తించి, వాటిని పీకి నాశనం చేయాలని వివరించారు. పురుగుల ఉధ్రుతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 15 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పత్తిలో తామర పురుగులను, పచ్చదోమ ఉధ్రుతిని గమనించటం జరిగిందని, వీటి నివారణకు ఫ్రిఫోనిల్ 400 మిల్లీ లీటర్లు గానీ, ఫ్లోనికామయిడ్ 60 గ్రాములు కానీ ఎకరానికి తగిన నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎసిఫేట్, మోనోక్రోటోఫాస్ మందులు రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు. వీటిని వాడినట్లయితే రసం పీల్చే పురుగు ఉధ్రుతి పెరుగుతుందని చెప్పారు. కాండం పూత విధానాన్ని రైతులకు వివరించారు. ఎల్‌బీజీ 904 రకం మినుము విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో నరశింహులు, వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పోస్టర్లును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా

ఫిరంగిపురం: మసీదుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ జిలానీ అన్నారు. హర్‌దిన్‌మే వైఎస్సార్- హబ్‌సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా బేతపూడి, గుండాలపాడు, పొనుగుపాడు, మునగపాడు, మేరికపూడి, 113 త్యాళ్లూరు, ఫిరంగిపురం గ్రామాల్లో గురువారం సయ్యద్‌హబీబుల్లా, షేక్ జిలానీలు మసిద్‌ల వద్దకు వెళ్లి మౌజమ్‌లు, ఇమామ్‌లకు జీతాలు సరిగా వస్తున్నదీ లేనిది వివరాలు అడిగితెలుసుకున్నారు. మసీదులకు సంబంధించి మరమ్మతులు నిర్వహించడం, వాటి ప్రహరీ, సౌకర్యాలు గురించి మత పెద్దలతో మాట్లాడారు. ఈసందర్భంగా హబీబుల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్లను మతపెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ బాబు, అబ్దుల్ గఫార్, ఖాజావలి, ఖాసిం షాహిద్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వివాహ ఏర్పాట్లలో ఘర్షణ

- ఓ వ్యక్తిపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



కత్తిపోట్లకు గురైన రమేష్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకానిలో వివాహ వేడుకల ఏర్పాట్లలో ఇద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. కార్పొరేషన్ పరిధిలోని చినకాకానిలో ప్రత్తిపాటి చిన్నబాబు, మల్లవరపు మహేశ్వరి వివాహం గురువారం మధ్యాహ్నం జరుగనున్నది. ఈ వివాహ వేడుకల్లో భాగంగా ముందస్తుగా తెల్లవారుజామున వంటవారు వంట చేసుకునేందుకు ఏర్పాటు చేస్తూ నిద్ర రాకుండా ఉండేందుకు సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. అక్కడే నివాసముండే మల్లవరపు శేషుబాబు వివాహ ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంతానికి వచ్చి సౌండ్ బాక్స్‌లను ఆపించాడు. సౌండ్ బాక్స్‌లు ఆపడంతో కుక్కమళ్ల రమేష్, మల్లవరపు శేషుబాబు మధ్య వాదనాలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో శేషుబాబు ఆవేశంతో పక్కనే ఉన్న కూరగాయల కత్తి తీసుకుని రమేష్ పొట్టలో పొడిచాడు. రమేష్‌కు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. రమేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతడి బంధువులు ఆటోలో వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

65 మందికి ఉచిత వైద్య సేవలు

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా 65 మందికి చేశామని కేర్‌వెల్ హాస్పటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. గుంటూరు వారితోట 7వ లైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల ఖరీదు చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. త్వరలోనే ఉచిత వైద్య శిబిరం మరోసారి నిర్వహిస్తామని కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ భాష తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు ఈ 8341713713, 9854757999 నెంబర్లలో సంప్రదించాలన్నారు.